

పరిరక్షణకు కృషి

గౌడ కుల హక్కుల పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. 8లో▸



స్ఫూర్తిగా తీసుకోవాలి

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸



చర్యలు తీసుకోవాలి

రెసిడెన్షియల్ హాస్టళ్లలో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య అన్నారు. 8లో▸

నేడు జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

వర్షాకాలం నేపథ్యంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. జల్‌పల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు తదితర విషయాలపై ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ: జల్‌పల్లి
కమిషనర్: అల్లూరి వాణిరెడ్డి
తేదీ: 2-09-2024 (సోమవారం)
సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
63025 03323

న్యూస్‌రీల్

నేడు స్కూళ్లకు సెలవు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు డీఈఓ సుశీందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ఐక్యవేదిక ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎస్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆదివారం కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య వేదిక పక్షాన కేంద్ర జాక్ పిలుపు మేరకు ఆందోళన చేపట్టినట్టు తెలిపారు. 20 ఏళ్లుగా నిరంతరాయంగా దేశ వ్యాప్తంగా ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ, టీజీఓ నాలుగో తరగతి ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హైడ్రాకు భయపడొద్దు

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన కాలనీవాసులు

మీర్‌పేట: హైడ్రాకు ఎవరూ భయపడొద్దని, అండగా ఉంటానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి భరోసా ఇచ్చారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి మంత్రాల చెరువు, చందన చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో నివసిస్తున్న సర్వోదయనగర్, ఎంఎల్‌ఆర్ కాలనీ, ప్రగతికాలనీ, శివాజీనగర్‌వాసులు ఆదివారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ రెండు చెరువుల కింద దాదాపు 30 ఏళ్లుగా ఐదువేల పేద, మధ్యతరగతి కుటుంబాలు నివాసముంటున్నాయని, హైడ్రా పేరుతో ఏ విధంగా ఇళ్లను కూలుస్తారని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొందరు రాజకీయ దురుద్దేశంతో చెరువుల వద్దకు వచ్చి ఎలాంటి అవగాహన లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజలను భయాందోళనలకు గురిచేయడం సరైంది కాదన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్వోదయనగర్ కాలనీ అధ్యక్షులు రామచందర్, సిద్ధయ్య, శివకుమార్, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, శ్రీనివాసరావు, శ్రీకాంత్, పాపయ్య, వీరాస్వామి, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

షాబాద్: అలుగు పారుతున్న చందనవెల్లి పెద్ద చెరువు



ఏకధాటిగా కురిసి ఏరులై పారి

రెండు రోజులుగా కురుస్తున్న వర్షం



మాడ్గుల: అర్కపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- మత్తడి దూకిన చెరువులు, కుంటలు
- పలు ప్రాంతాల్లో కూలిన ఇళ్లు
- నీట మునిగిన పంటలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి జిల్లాలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. ఈసీ, మూసీ వాగులకు వరద పోటెత్తడంతో జంట జలాశయాల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. భారీ వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించి పోయింది. రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పంటచేలను వరద ముంచెత్తడంతో చేతికి అందివచ్చిన టమాటా, ఆకుకూరల పంటలు దెబ్బ తిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.

ఆయా ప్రాంతాల్లో కూలిన ఇళ్లు

ఫరూఖ్‌నగర్ మండలం దేవునపల్లి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి (35) గల్లంతై శవమై తేలాడు. పలు ప్రాంతాల్లో పాత గోడలు, మిద్దెలు కూలాయి. శనివారం అర్ధరాత్రి ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్లకు చెందిన చింతకొండపల్లి సత్తయ్య ఇల్లు కూలింది. మాడ్గుల మండలం అర్కపల్లికి చెందిన సీత లింగయ్య ఇల్లు కూలి ఇంట్లోని వస్తువులు, ఆహార ధాన్యాలు తడిసి ముద్దయ్యాయి. తలకొండపల్లి మండలం చంద్రధనలో రెండు ఇళ్లు కూలిపోయాయి.

రికార్డు స్థాయి వర్షపాతం

జిల్లాలో అత్యధికంగా నందిగామలో 13.72 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా రాజేంద్రనగర్‌లో 5.07 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. కేశంపేటలో 13.42 సెం.మీ, తలకొండపల్లిలో 13.40 సెం.మీ, ఆమనగల్లులో 12.32 సెం.మీ, షాబాద్‌లో 11.38 సెం.మీ, ఫరూఖ్‌నగర్‌లో 10.57 సెం.మీ, చేవెళ్లలో 9.94 సెం.మీ, కడ్తాల్‌లో 9.77 సెం.మీ, కొత్తూరులో 9.05 సెం.మీ, కొందుర్గులో 8.57 సెం.మీ, శంకర్‌పల్లిలో 8.48 సెం.మీ, మహేశ్వరంలో 8.19 సెం.మీ, మంచాలలో 8.18 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో భారీ వర్షాలు కురుస్తుండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఇరిగేషన్ ఇంజనీర్లు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి, ముంపు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. శిథిల భవనాలను గుర్తించి, వాటిలో నివసిస్తున్న వాళ్లను ఖాళీ చేయిస్తున్నారు.

నేలకూలిన విద్యుత్ స్తంభాలు

చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. సైబర్ సిటీలో పది, రాజేంద్రనగర్‌లో ఎనిమిది, సరూర్‌నగర్ సర్కిల్లో ఆరు ఫీడర్ల చొప్పున ట్రిప్పయ్యాయి. వసంతనగర్, సరూర్‌నగర్, చంపాపేట్, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో పెద్దపెద్ద చెట్లు విరిగి లైన్లపై పడటంతో ఆయా ప్రాంతాలకు గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా లైన్లపై పడిన చెట్ల కొమ్మలను ఇంజనీర్లు తొలగించి, సరఫరాను పునరుద్ధరించారు.

స్తంభించిన జనజీవనం

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. నిత్యం రద్దీగా కనిపించే షాద్‌నగర్, శంషాబాద్, చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, నార్సింగి, మణికొండ, మాదాపూర్, శేరిలింగంపల్లి, మీర్‌పేట్, బడంగ్‌పేట్, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్, తదితర ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లన్నీ ఖాళీగా కన్పించాయి. వీధుల్లోకి భారీగా వరద నీరు చేరడంతో ఇల్లు విడిచి బయటికి అడుగు పెట్టేందుకు జనం వెనుకాడారు. రోజంతా ఇళ్లకే పరిమితమయ్యారు.



కొందుర్గు: గుర్రంపల్లి చెరువులో లభించిన పెద్ద చేపలను చూపిస్తున్న గ్రామస్తులు



చేవెళ్ల: దేవరంపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో నీట మునిగిన పూల తోట



తుర్కయంజాల్: ఇంజాపూర్ ఆపిల్ అవెన్యూ కాలనీలోకి చేరిన వరద



చెరువుల చెంతకు వెళ్లొద్దు

జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఉధృతంగా ప్రవహిస్తున్న అయ్యవారిపల్లి వాగును ఆదివారం జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి పరిశీలించారు. వాగువద్ద చేపడుతున్న రక్షణ చర్యలను ఎంపీడీఓ బన్సీలాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు వాగులు, చెరువుల వద్దకు చేపల వేటకు వెళ్లకూడదని సూచించారు. వాగు ఉధృతిని దృష్టిలో పెట్టుకొని అధికారులు వాగు పరీవాహక ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించాలని అన్నారు. వాగు సమీపంలో పోలీసు సిబ్బందితో పహారా ఏర్పాటు చేసి వాగు పరీవాహక ప్రాంతంలోకి ప్రజలు రాకుండా చూడాలన్నారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుందనే విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు వాగు పరీవాహక గ్రామాల్లో దప్పు చాటింపు వేయించాలని సూచించారు. చెరువును పరిశీలించిన వారిలో ఎంపీఓ జయంత్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వర్షాల వేళ అప్రమత్తత అవసరం

జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్



అమ్డాపూర్ వద్ద ఈసీ వాగును పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్

మొయినాబాద్‌రూరల్: జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ప్రమాదాల బారినపడొద్దు అని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ సూచించారు. అమ్డాపూర్ ఈసీ వాగును ఆదివారం ఆయన మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. భారీ వర్షాలకు వాగులు, వంకలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని, వాటివైపు వెళ్లకుండా చూడాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లు ఉంటే ఆ కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపీవో వెంకటేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు ఉన్నారు.

రైతు సమస్యలపై ఐక్య పోరాటం



మాట్లాడుతున్న అఖిల భారత కిసాన్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్

అఖిల భారత కిసాన్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్

ఇబ్రహీంపట్నం రూరల్: రైతులకు ద్రోహం చేసిన ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాజకీయ శిక్షణ తరగతులు రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని చింతపల్లిగూడ గేటు సమీపంలో గల శుభం కన్వెన్షన్ హాల్‌లో జరుగుతున్నాయి. రెండోరోజు తరగతుల్లో భాగంగా 'వ్యవసాయ రంగం సవాళ్లు-ప్రత్యామ్నాయం' అంశంపై నిర్వహించిన సదస్సులో డాక్టర్ విజ్జు కృష్ణన్ మాట్లాడారు. అఖిల భారత రైతు సంఘాలు దేశా వ్యాప్తంగా చేసిన పోరాటంలో 738 మంది రైతులను చంపిన చరిత్ర బీజేపీ సర్కార్‌కే దక్కిందన్నారు. రైతుల పోరాటానికి స్పందించి ఏడాది తర్వాత మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా 158 సీట్లకే బీజేపీ పరిమితమైందని, ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం చంద్రబాబు నాయుడు, నితీష్ సహకారంతో వెంటిలేటర్‌పై కొనసాగుతోందన్నారు. పదేళ్ల కాలంలో 1.12 లక్షల మంది రైతులు, 3.20 లక్షల మంది వలస కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాయమాటలు చెప్పి 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. తెలంగాణలో పత్తికి మద్దతు ధర ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. రూ.16వేలు ఇవ్వాల్సిన మద్దతు ధర రూ.6,600కే పరిమితమైందన్నారు. ధరల నియంత్రణలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, కార్పొరేట్ శక్తులే ధరలు నిర్ణయిస్తున్నాయని మండిపడ్డారు. రైతు సమస్యలపై మరోసారి ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. నవంబర్ 15–25 వరకు గ్రామాల్లో క్యాంపెనింగ్, 26న ఢిల్లీలో రైతులతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి, కాడిగళ్ల భాస్కర్, రామకృష్ణారెడ్డి, ముసలయ్య, పంది జంగయ్య, శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుకుంటూ వెళ్లి.. నీటి గుంతలో పడి

బాలుడి మృతి



ఆరీఫ్ మృతదేహం

షాద్‌నగర్: ఇంటి ముందు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ఓ బాలుడు మృతి చెందిన విషాదకర సంఘటన షాద్‌నగర్ పట్టణంలోని నోబుల్ పార్కు కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన మీర్ అహ్మద్, రోషన్ దంపతులు. వారికి కుమారుడు ఆరీఫ్ (13 నెలలు) ఉన్నాడు. ఆదివారం సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో ఇంటి ముందు ఆరీఫ్ గంతులేస్తూ ఆడుకుంటున్నాడు. ఇంటి ముందు ఉన్న గుంతలో వర్షం నీరు భారీగా చేరడంతో బాలుడు ప్రమాదవశాత్తు ఆడుకుంటూ వెళ్లి అందులో పడ్డాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆరీఫ్‌ను బయటికి తీసి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి మృతితో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నిండుకుండలా హిమాయత్ సాగర్

బండ్లగూడ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్ సాగర్ జలాశయానికి వరద నీరు కొనసాగుతోంది. జలాశయం నీటి మట్టం 1,756.60 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తి నీటి మట్టం 1,763.50 అడుగులు. జలాశయంలోకి 3,500 క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నందున ఇన్‌ఫ్లో ఇంకా పెరిగే అవకాశం ఉందని జలమండలి అధికారులు తెలిపారు.

దూడలను చంపింది హైనానా? పులా?

- భయాందోళనలో రైతులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎఫ్ఓ సుధాకర్



దూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ, అటవీశాఖ సిబ్బంది తదితరులు

తలకొండపల్లి: గుర్తు తెలియని జంతువు దాడిలో లేగదూడలు మృతి చెందాయి. ఈ ఘటన మండల పరిధిలోని మాదాయిపల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ...గ్రామ శివారు ప్రాంతంలో మదిగట్ల ఆనంద్, నెహ్రూ బాబులకు వ్యవసాయ పొలాలున్నాయి. వీరు తమ దూడలను పొలం వద్ద పశువుల కొట్టంలో కట్టేసి ఇంటికి వచ్చారు. రోజుమాదిరిగా ఆనంద్, నెహ్రూబాబులు ఆదివారం ఉదయం పాలు తీసుకొద్దామని పొలం వద్దకు వెళ్లి చూశారు. అక్కడ గుర్తు తెలియని జంతువు దాడిలో లేగ దూడలు మృతి చెంది ఉండడాన్ని గమనించారు. వాటిని చంపిన చోట జంతువు పాదముద్రలు కనిపించడంతో పులి చంపి ఉండొచ్చని స్థానిక గ్రామస్తులు, రైతులు భయాందోళన చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న డీఎఫ్ఓ సుధాకర్‌తో పాటు, ఎఫ్‌డీఓ వేణు మాధవ్, రేంజ్ ఆఫీసర్ జగన్‌మోహన్, సెక్షన్ ఆఫీసర్ అన్వర్ హుస్సెన్ ఖాన్, బీట్ ఆఫీసర్ రాఘవేందర్‌లు మృతి చెందిన లేగ దూడల కళేబరాలను పరిశీలించారు. జంతువు పాదముద్రలను గమనించి హైనయేనని నిర్ధారించారు. హైనా దాడుల్లో మృతిచెందిన లేగ దూడలకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఇప్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని డీఎఫ్ఓ తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని సూచించారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



మల్లేశ్ (ఫైల్)

యాచారం: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్కీజ్‌గూడ మాజీ సర్పంచ్ ఎన్‌వీ మల్లేశ్ (70) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మల్లేశ్‌కు ఉదయం చాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ఆయన మృతి చెందాడు. మండలంలో కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేశాడు. ఆయన అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం గ్రామంలో నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మాజీ ఎంపీపీ రాచర్ల వేంకటేశ్వర్లు హాజరై నివాళులర్పించారు.

దాడి ఘటనలో పలువురికి రిమాండ్

కొత్తూరు: మండలంలోని జేపీదర్గా ఆవరణలో ఇటీవల చోటు చేసుకున్న ఇరు వర్గాల దాడి ఘటనలో ఓ టీవీ రిపోర్టర్ ఫయాజ్‌తో పాటు పలువురిని నిందితులుగా పేర్కొంటూ కొత్తూరు పోలీసులు ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ జి.శ్రీనివాస్ వివరాల మేరకు.. ఇన్ముల్‌నర్వకు చెందిన ఫయాజ్ మునావర్ గతంలో ఆయా టీవీ చానళ్లలో పనిచేస్తూ పలువురి వద్ద మామూళ్లు వసూలు చేసేవాడు. అతడి వేధింపులు భరించలేని బాధితులు సంబంధిత చానళ్ల యాజమాన్యాలకు ఫిర్యాదు చేయడంతో అతడిని తమ సంస్థల నుంచి తప్పించారు. ఈ క్రమంలో మరో టీవీ చానల్‌లో చేరి జేపీదర్గా సబ్ కాంట్రాక్టర్ల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేశాడు. ఒకేసారి వారి నుంచి రూ.5 లక్షలు డిమాండ్ చేయడంతో వారు నిరాకరించడంతో తన అనుచరులతో కలిసి దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తిమ్మాపూర్ బస్టాప్‌లో ఉండగా ఫయాజ్‌తో పాటు అతని అనుచరులు షౌకత్, సాధిక్, జమీల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రేతలకు రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: గంజాయి విక్రయేతలను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐలు రాజు, వెంకటేశ్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సంతోష్ సర్కార్ (78), బిస్వజిత్ మధు (31) డబ్బు సులువుగా సంపాదించాలని గంజాయి వ్యాపారాన్ని ఎంచుకున్నారు. ఒడిశా రాష్ట్రం నుంచి తక్కువ ధరకు తీసుకొచ్చి ఆదిబట్ల, కొంగరకలాన్ సమీపంలో కూలీలకు విక్రయిస్తున్నారు. రెండు రోజుల క్రితం కొంగరకలాన్ కల్వకోలు లక్ష్మీదేవమ్మ ఫంక్షన్ హాల్ సమీపంలో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 5.3 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మణికంఠ మృతదేహం

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొత్తూర్‌కు చెందిన కాటం చెన్నయ్య కొత్తూర్ చౌరస్తా శ్రీశైలం రహదారిపై టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. టిఫిన్ సెంటర్ వద్దకు సామగ్రి తీసుకొని అతని కుమారుడు మణికంఠ (20) వచ్చాడు. టిఫిన్ సెంటర్ పక్కనే నిలబడి టిఫిన్ చేస్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వైపు వేగంగా వెళ్తున్న కారు (టీఎస్ 07 హెచ్‌టీ 4950) అతడిని ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ యువకుడిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



మాచన్‌పల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

షాబాద్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రస్తుత సమాజంలో అందరికీ గౌరవం దక్కుతుందని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని మాచన్‌పల్లిలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి తెలంగాణ గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజని సాయిచంద్, వెన్నెల గద్దర్, బేగరి రాజుతోతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ మహోన్నత వ్యక్తి అని, ఆయన రచించిన రాజ్యాంగంతోనే నేడు అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. అంబేడ్కర్ వల్లే మహిళలకు రిజర్వేషన్లు, అన్ని కులాలకు సమాన హక్కులు దక్కాయని తెలిపారు. తెలంగాణ గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజని సాయిచంద్, వెన్నెల గద్దర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శులు పీసరి సురేదర్‌రెడ్డి, ఎన్. రాంరెడ్డి, సీనియర్ నాయకులు మాణిక్యరెడ్డి, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌రెడ్డి, సత్తయ్య, అంబేడ్కర్ సంఘం నాయకులు రాములు, మాణిక్యరెడ్డి, యాదయ్య, సుమన్, శ్రీను, విఠల్, మహేందర్, మండల నాయకులు రవీందర్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

గౌడకుల హక్కుల పరిరక్షణకు కృషి

శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న స్వామిగౌడ్

మొయినాబాద్: గౌడ కుల హక్కుల పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో ఆదివారం గౌడకుల హక్కుల పరిరక్షణ సమితి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్వామిగౌడ్ మాట్లాడుతూ.. గౌడ కుల వృత్తి అభివృద్ధికి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గౌడలంతా ఐకమత్యంతో పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని.. కులవృత్తిని కొనసాగించాలన్నారు. ఈత, తాటి వనాలను పెంచడానికి ప్రభుత్వం భూమిని కేటాయించి ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ సందర్భంగా గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా చిలుకూరుకు చెందిన సిద్ధంతి నర్సింహగౌడ్, ఉపాధ్యాక్షుడిగా సురంగల్‌కు చెందిన అశోక్‌గౌడ్‌ను నియమించారు. మొయినాబాద్ మండల అధ్యక్షుడిగా బస్వాపురం అంజయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణగౌడ్, మహేష్‌గౌడ్, భిక్షపతిగౌడ్‌ను నియమించారు. యూత్ కమిటీ మండల అధ్యక్షుడిగా విజయ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా యాదయ్యగౌడ్, దేవేందర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు రామకృష్ణగౌడ్, కృష్ణగౌడ్, భిక్షపతిగౌడ్, నవీన్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో మిగిలిన బీఈ మొదటి సంవత్సరం సీట్లకు సోమవారం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ తెలిపారు. బయోమెడికల్ ఇంజినీరింగ్‌లో 6, మైనింగ్ ఇంజినీరింగ్‌లో 19, మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఒక సీటు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. కాలేజీలోని అసెంబ్లీ హాల్‌లో జరిగే స్పాట్ అడ్మిషన్లకు ఉదయం 11 గంటలకు హాజరుకావాలన్నారు. ఎంసెట్ ర్యాంక్ కార్డుతో పాటు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

ప్రజలకు ఇబ్బంది కలగొద్దు

సాక్షి, సిటీ బ్యూరో: భారీ వర్షాల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఫారెస్ట్రీ విభాగం డైరెక్టర్ ప్రదీప్ కుమార్ శెట్టి అన్నారు. గత రెండు రోజులుగా నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు పార్కులు, రహదాల వెంబడి చెట్లు, కొమ్మలు నేలకొరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు వాటిని తొలగించేందుకు హెచ్‌ఎండీఏ, అర్బన్ ఫారెస్ట్రీ విభాగాలు సంయుక్తంగా పని చేస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశాల మేరకు అన్ని పార్కులు, రహదారులపైన విరిగి పడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. కూకట్‌పల్లి, పటేల్ కుంట పార్కు, కొత్వాలగూడ ఎకో పార్కు, సంజీవయ్య పార్క్, నెక్లెస్ రోడ్, ట్యాంకుబండ్ పైన విరిగిన కొమ్మలను తొలగించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కారు ఢీకొని యువతికి తీవ్ర గాయాలు



సీసీ కెమెరాలో రికార్డయిన ప్రమాద దృశ్యం

హస్తినాపురం: వేగంగా దూసుకువచ్చిన వచ్చిన ఓ కారు అదుపు తప్పి పార్కు ఎదుట నడిచి వెళుతున్న యువతిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హయత్‌నగర్‌కు చెందిన సోని(21) ఆదివారం ఎన్‌జీఓస్‌కాలనీలో వివేకానంద పార్కు ఎదుట నడిచి వెళుతుండగా వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొంది. దీంతో గాల్లోకి ఎగిరిపడిన సోనీకి తీవ్రంగా గాయపడింది. మార్నింగ్ వాక్‌కు వచ్చిన స్థానికులు 108 కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం సాగర్ రింగ్‌రోడ్డులోని మెడికేర్ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో స్కూల్ ప్రిన్సిపాల్ మృతి

ఘట్‌కేసర్: విద్యుదాఘాతంతో ఓ స్కూల్ ప్రిన్సిపాల్ మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీనివాసరావు(48) మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్ విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఖమ్మంలో ఉండగా శ్రీనివాసరావు పాఠశాలలోనే ఉండేవాడు. ఆదివారం ఉదయం టిఫిన్ చేసిన అనంతరం గదిలోకి వెళ్లిపోయాడు. సాయంత్రం అతను భవనంపై పడి ఉండడాన్ని గుర్తించిన ఉపాధ్యాయుడు రాజేశ్ స్కూల్ యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. రూఫ్‌పై నిలిచిన నీటిని తొలగించేందుకు వెళ్లిన అతను కరెంట్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్కూల్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య

శంషాబాద్ రూరల్: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేలా రెసిడెన్షియల్ హాస్టళ్లలో మౌలిక వసతులు, సౌకర్యాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య అధికారులకు సూచించారు. పాల్మాకులలో ఉన్న కేజీబీవీని ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కులం పేరుతో దూషించిన ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా చేయాలన్నారు. అంతకుముందు ఆయన పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట డీఈఓ సుశీందర్‌రావు, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కందుకూరు: పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిదిమంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమ్మతండా సమీపంలోని వ్యవసాయ పొలంలోని పశువుల కొట్టంలో కొంత మంది పేకాట ఆడుతున్నారనే సమాచారంతో శనివారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పేక ముక్కలు, 9 సెల్‌ఫోన్లు, రూ.73,490 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ సైదులు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

చేపలకోసం వెళ్లి.. శవమై తేలి



శేఖర్ మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: చేపలకోసం చెరువులోకి వెళ్లిన వ్యక్తి విగతజీవిగా మారాడు. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామశివారులో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. దేవునిపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి శేఖర్ (35) ఆదివారం గ్రామ శివారులోని పల్లం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో చెరువులోకి భారీగా వరదనీరు చేరింది. శేఖర్ చెరువులోకి దిగుతుండగా లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో చెరువు నీటిలో మునిగిపోయాడు. అదే సమయంలో కొంతమంది గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ విజయకుమార్ రెవెన్యూ అధికారులు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెరువులోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. శేఖర్ మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి బావ రాగరి బుడ్డయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని డెలివరీ బాయ్ మృతి

మణికొండ: బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న యువకుడు లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లాకు చెందిన నరేష్(23) నానక్‌రాంగూడ ప్రాంతంలో ఉంటూ జొమాటో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి అతను బైక్‌పై ఫుడ్ డెలివరీ చేసేందుకు వెళుతుండగా మైహోం అవతార్ వద్ద వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. అతని తల పైనుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'టానిక్' మద్యం షాప్ సీజ్





టానిక్ మద్యం షాప్‌ను సీజ్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

బంజారాహిల్స్: లైసెన్స్ గడువు ముగియడంతో జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36లోని టానిక్ ఎలైట్ లిక్కర్ మార్ట్‌ను ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. రూ.1.70 కోట్ల విలువైన 10,291 మద్యం సీసాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శాస్త్రి, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2016 నుంచి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లో కొనసాగుతున్న టానిక్ ఎలైట్ మద్యం షాప్ అనేక వివాదాలకు కేంద్రంగా మారిందన్నారు. ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నందున ఈ దుకాణాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించి ప్రతి రెండేళ్లకోసారి మద్యం దుకాణాల వేలం నిర్వహిస్తామని, కానీ 2016లో ప్రత్యేకంగా టానిక్ ఎలైట్ షాప్‌కు అనుమతి తీసుకున్న యజమాని మరోసారి రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ చట్టానికి వ్యతిరేకంగా ఉన్నందున టానిక్ ఎలైట్ షాప్ రెన్యువల్‌ను తిరస్కరించామన్నారు. ఆగస్టు 31న షాప్ లైసెన్స్ గడువు ముగిసినందున దుకాణాన్ని సీజ్ చేసినట్లు వారు వివరించారు.

మట్టి గణపతి.. మహాగణపతి



మట్టి గణపతి ప్రతిమల తయారీ పోటీల్లో చిన్నారులు

సనత్‌నగర్: మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా ఆదివారం స్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహాల తయారీ పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 50 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ నాగేశ్వరరావు మట్టి గణపతి తయారీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు తెలియజేస్తూ మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వారికి జ్యూట్ బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా 'మట్టి గణపతి మహా గణపతి' అనే అంశంపై విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ కళాజాత బృందం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోడల్ కాలనీ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు జీఎస్‌టీ శాయి, హారిక, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ సినిమాను నిషేధించాలి

సిక్కుల నిరసన ప్రదర్శన



గురుద్వారా ఎదుట నిరసన చేపట్టిన సిక్కులు

అమీర్‌పేట: త్యాగధనులైన సిక్కులను అరాచకశక్తులుగా చూపిస్తూ రూపొందించిన 'ఎమర్జెన్సీ' సినిమాను నిషేధించాలని డిమాండ్ చేస్తూ సిక్కులు ఆందోళన చేపట్టారు. ఆదివారం అమీర్‌పేట గురుద్వారా ఎదుట సినిమాను వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. సిక్కుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్న ఈ సినిమాను ఎక్కడా ప్రదర్శించకుండా నిషేధం విధించాలని నినాదాలు చేశారు.దేశం కోసం రక్తం చిందించిన వారిలో సిక్కులు మొదటి వరుసలో ఉంటారని, వారి త్యాగాలను దాచి పెట్టి, ఎమర్జెన్సీ నాటి కాలంలో చోటు చేసుకున్న దురదృష్టకర ఘటనలను ఎత్తి చూపి మొత్తం సిక్కు సమాజాన్నే తీవ్రవాద ప్రోత్సాహకులుగా చిత్రీకరించారన్నారు. పార్లమెంట్ సభ్యురాలైన కంగనా రనౌత్ నిర్మాణ సారథ్యంలో సిక్కు సమాజాన్ని అరాచక శక్తులుగా చూపిస్తూ రూపొందించిన చిత్రం విడుదలను అడ్డుకుంటామన్నారు.తెలంగాణలో ఈ చిత్రం విడుదలపై నిషేధం విధించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని సిక్కు సమాజం పక్షాన విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుద్వారా ప్రబంధక్ కమిటీ చైర్మన్ అజిత్‌సింగ్,మాజీ చైర్మన్ భాగిందర్ సింగ్, ప్రతినిధులు ఇందర్‌జీత్‌సింగ్ పాల్గొన్నారు.